## తిరుమలలో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో అపశృతి



**అమరావతి,:** తిరుమలలో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు ముందు చిన్న అపశృతి చోటు చేసుకుంది. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు రంగరంగ వైభవంగా నిర్వహించడానికి టీటీడీ అధికారులు, సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం సాయంత్రం ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తారు. ధ్వజస్తంభంకు ఉండే ఇనుప కొక్కెం ద్వారానే అర్చకులు గరుడ పతాన్ని ఎగురవేస్తారు. అయితే శుక్రవారం ధ్వజస్థంభానికి ఉండే ఈ ఇనుప కొక్కెం విరిగిపోయింది. ఈ విషయం తెలుసుకున్న టీటీడీ అధికారులు తిరుమల అర్చకుల సహాయం తీసుకుని వెంటనే అప్రమత్తం అయ్యారు. ధ్వజస్థంభానికి ఏర్పాటు చేసిన ఇనుప కొక్కెం మరమ్మతులు చేపట్టారు. తిరుమల శ్రీవారి ఆలయం అర్చకుల సహాయంతో టీటీడీ అధికారులు, సిబ్బంది ధ్వజస్థంభానికి ఉండే ఇనుప కెక్కెం మరమ్మతులు చేపట్టారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా శుక్రవారం సాయంత్రం తిరుమల బ్రహ్మోత్సవాలలో భాగంగా ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తామని టీటీడీ అధికారులు తెలిపారు. శ్రీవారి లడ్డులో కల్తీ నెయ్యి కలిపారనే వ్యవహారంపై వివాదం చెలరేగిన సమయంలో నిర్వహిస్తున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఇలాంటి చిన్న అపశృతి జరగడంతో తిరుమల అర్చకులు, టీటీడీ అధికారులు అప్రమత్తం అయ్యారు. ఇలాంటి అపశృతులు మరోసారి చోటుచేసుకోకుండా శ్రీవారి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు పూర్తిచేయాలని టీటీడీ అధికారులు, సిబ్బంది అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబ సమేతంగా శుక్రవారం తిరుమల చేరుకుంటున్నారు. ఈ సందర్భంగా టీటీడీ ఈవో శ్యామలరావు సీఎం చంద్రబాబు నాయుడు పర్యటనపై సంబంధిత అధికారుల నుండి వివరాలు సేకరించారు. శుక్రవారం మధ్యాహ్నం తిరుమలలోని వివిధ ప్రాంతాలను పరిశీలించిన టీటీడీ ఈవో శ్యామల రావు సీఎం చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పోలీసు అధికారులు, విజిలెన్స్, రెవెన్యూ, అటవి శాఖ అధికారులతో టీటీడీ ఈవో శ్యామలరావు ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు విషయాలపై చర్చించారు.

## సజ్జల రామకృష్ణారెడ్డికి హైకోర్టులో భారీ ఊరట..!



**అమరావతి,:** ఏపీలో గత వైసీపీ ప్రభుత్వంలో సీఎం జగన్ తర్వాత నంబర్ టూగా ఉన్న ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి కూటమి సర్కార్ అధికారంలోకి రావడంతో కష్టాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఇవాళ హైకోర్టు ఓ కేసులో ఆయనకు భారీ ఊరట కల్పిస్తూ ఆదేశాలు ఇచ్చింది. అదే సమయంలో ఆయనకు కీలక షరతు కూడా విధించింది. దీంతో ఆయనకు ప్రస్తుతానికి ఊరట లభించినట్లయింది. వైసీపీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న సజ్జల రామకృష్ణారెడ్డి గత జగన్ సర్కార్ హయాంలో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో నిందితుడిగా ఉన్నారు. దీంతో ఆయన్ను అరెస్టు చేసేందుకు పోలీసులు సిద్దమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో విచారణ జరిపిన హైకోర్టు.. ఇవాళ ఆయన్ను అరెస్టు చేయకుండా పోలీసులకు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. అదే సమయంలో ఈ కేసులో దర్యాప్తుకు పోలీసులకు పూర్తిగా సహకరించాలని సజ్జల రామకృష్ణారెడ్డిని హైకోర్టు ఆదేశించింది. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో తనకు సంబంధం లేదని, ఈ కేసులో నిందితులు ఇచ్చిన వాంగ్మూల ఆధారంగా తనను పోలీసులు ఏ 120గా కేసులో చేర్చారని సజ్జల తెలిపారు. దీంతో అన్ని అంశాల్ని పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు ఆయన అరెస్టు కాకుండా మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ఈనెల 25కు వాయిదా వేసింది.

## మంత్రి పదవులు నాకేం కొత్త కాదు : మంత్రి తుమ్మల




**హైదరాబాద్, :** ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మిగతా 20 లక్షల మందికి 2 లక్షల వరకు రుణమాఫీ చేసే బాధ్యత తమదేనని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. తనకు మంత్రి పదవులు కొత్తకాదని తెలిపారు. మంత్రి పదవి కోసమో, ఇతర పదవులకు ఆశపడి మాట్లాడే నైజం తనది కాదన్నారు. రుణమాఫీపై ప్రభుత్వం స్పష్టమైన వివరాలు ఎప్పటికప్పుడు వెల్లడించినప్పటికీ బీజేపీ నాయకులు రైతులను గందరగోళపరిచి రాజకీయ పబ్బం గడుపుకునేందుకు దీక్షల పేరిట కొత్త డ్రామాకు తెరతీశారని మండిపడ్డారు. గురువారం మీడియా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో మొత్తం 65.56 లక్షల మంది రైతులు ఉన్నారన్నారు. భూములు ఉండి బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న రైతుల సంఖ్య 42 లక్షలు అన్నారు. 2018 రుణమాఫీ పథకంలో గత ప్రభుత్వానికి అందిన ఖాతాలు 40 లక్షలు మాత్రమే అన్నారు. అందులో కనీసం 20 లక్షల మందికి కూడా రుణమాఫీ కాలేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించిన 42 లక్షల మందికి మొదటి పంటకాలంలోనే రుణమాఫీ ఈ ఏడాదిలోనే అమలు చేయడానికి చిత్తశుద్ధితో ఉందన్నారు.

## ఎమ్మెల్సీ కవిత లిక్కర్ కేసు వాయిదా..!



**హైదరాబాద్, :** ఢిల్లీ లిక్కర్ కేసు విచారణ వాయిదా పడింది. ఈ కేసులో సీబీఐ దాఖలు చేసిన చార్జ్ షీట్ పై శుక్రవారం ఢిల్లీ రౌస్ ఆఫ్ అవెన్యూ కోర్టులో విచారణ జరిగింది. కోర్టుకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత, ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, ఆమ్ ఆద్మీ పార్టీ నేత దుర్గేష్ పాఠక్, విజయ్ నాయర్ వర్చ్ వల్ గా విచారణకు హాజరయ్యారు. ఇక తదుపరి విచారణ అక్టోబర్ 19 వరకు కోర్టు వాయిదా పడింది. ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో ఎమ్మెల్సీ కవిత, ఆమ్ ఆద్మీ పార్టీ నేత మనీష్ సిసోడియా, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ వంటి తదితర నేతలకు ఇటీవలే సుప్రీంకోర్టు బెయిల్ ని మంజూరు చేసిన విషయం అందరికీ తెలిసిందే. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ నేతృత్వంలో కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా కోర్టు విచారణలు కొనసాగుతున్నాయి.

## ప్రకాష్ రాజ్ మరో ట్వీట్.. పవన్ కళ్యాణ్ కి మరో కౌంటర్



**హైదరాబాద్, :** సినీ నటుడు ప్రకాష్ రాజ్ వరుస ట్వీట్స్ తో హాట్ టాపిక్ అయ్యారు. తిరుమల లడ్డు వివాదం ఎప్పుడైతే మొదలైందో అప్పటినుండి ప్రకాష్ రాజ్ - ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మధ్య ట్విట్టర్ వార్ నడుస్తూనే ఉంది. పవన్ కళ్యాణ్ దేవుడిని రాజకీయాలలోకి లాగాడంటూ తనకు సమయం దొరికినప్పుడల్లా విమర్శిస్తున్నారు ప్రకాష్ రాజ్. ఇక గురువారం తిరుపతిలో వారాహి డిక్లరేషన్ సభలో సనాతన ధర్మం గురించి పవన్ కళ్యాణ్ సుదీర్ఘ ప్రసంగం ఇచ్చిన విషయం తెలిసిందే. సనాతన ధర్మ పరిరక్షణ కోసం కేంద్రానికి పలు సూచనలు చేస్తూ డిక్లరేషన్ ని విడుదల చేశారు పవన్ కళ్యాణ్. ఇతర మతాలను కించపరిస్తే నటులు, చిత్ర పరిశ్రమ, వ్యాపారులు అందరూ మాట్లాడతారని.. కానీ సనాతన ధర్మంపై దాడులు జరిగితే ఒక్కరు స్పందించరని ఆరోపించారు. సనాతన ధర్మంపై దాడులు జరిగితే ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా ధైర్యంగా గొంతు విప్పాలని కోరారు పవన్ కళ్యాణ్. అయితే పవన్ కళ్యాణ్ వ్యాఖ్యల నేపథ్యంలో నటుడు ప్రకాష్ రాజ్ మరోసారి ఆయనని ఉద్దేశిస్తూ పరోక్షంగా ట్వీట్ చేశారు. " సనాతన ధర్మ రక్షణలో మీరు ఉండండి. సమాజ రక్షణలో మేముంటాం. జస్ట్ ఆస్కింగ్ " అని ట్విట్టర్ లో పేర్కొన్నారు.

# నేడే శంషాబాద్ మున్సిపల్ నూతన భవనం ప్రారంభం

నేడే శంషాబాద్ మున్సిపల్ నూతన భవనం ప్రారంభం





శంషాబాద్ ప్రతినిధి (నేటి శుభోదయ)అదునతన హంగులతో కోట్లు వెచ్చించి శంషాబాద్ మున్సిపల్ నూతన భవనాన్ని శాతంరాయ్ సింప్లెక్స్ వద్ద నిర్మాణం చేపట్టారు. అనతికాలంలోనే మున్సిపల్ భవనం అన్ని హంగులతో తుదిమెరుగులు దిద్దుకొని ప్రారంభం కు సిద్దమైంది. అందుకు పౌరోహితులు ముహూర్తం కూడా ఖరారు చేసారు.గత కొన్ని సంవత్సరాలుగా అతిపురాతనమైన ఇరుకు గధుల్లో గ్రామపంచాయితీ విధులు నిర్వహించారు. శంషాబాద్ మున్సిపల్ గా రూపంతరం చెందిన తరువాత మున్సిపల్ కు భారీగా ఆదాయం వస్తున్నా నేపథ్యంలో నూతన భావన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. సంబంధిత కాంట్రాక్టర్ పనులను వేగంగా పూర్తి చేయడంతో మున్సిపల్ సకాలంలో పూర్తి అయ్యింది.

### ఎమ్మెల్యే చోరువతో నూతన మున్సిపల్ ఏర్పాటు చేవెళ్ల ప్రసాద్

పాత మున్సిపల్ కార్యాలయం ఉన్నప్పుడు అధికారులు కూర్చోవడానికి కూడా స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీన్ని అర్థం చేసుకున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సింప్లెక్స్ వద్ద నూతన భవనానికి స్థలాన్ని కేటాయించి మున్సిపల్ నూతన భవన నిర్మాణానికి ఎంతో చొర చూపారు. మున్సిపల్ భవన నిర్మాణానికి అవసరమైన నిధులను రాబట్టడంలో ఎమ్మెల్యే సఫలీకృతను సాధించారు. నూతనంగా నిర్మించిన మున్సిపల్ భవనంలో అన్ని శాఖలకు సంబంధించిన చాంబర్లను ఏర్పాటు చేయడమే కాకుండా చైర్మన్ వైస్ చైర్మన్ లకు ప్రత్యేక క్యాబిన్లను ఏర్పాటు చేశారు దీంతో పాటు కౌన్సిలింగ్ మీటింగ్ నిర్వహించుకునేందుకు భారీ హాల్లు సైతం నిర్మించారు. విశాలవంతమైన పార్కింగ్ హాల్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, బర్త్ సర్టిఫికెట్లు, మున్సిపల్ లో పనిచేసే ప్రతి విభాగానికి ప్రత్యేక గదులను ఏర్పాటు చేశారు. నేడు జరిగే మున్సిపల్ నూతన భవన ప్రారంభోత్సవానికి దుద్దిల్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ కొలన్ సుష్మా మహేందర్ రెడ్డి, పట్నం మహేందర్ రెడ్డి,మున్సిపల్ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్, కో ఆప్షన్ సభ్యులు చేవెళ్ల కవితప్రసాద్, మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల కౌన్సిలర్లు అధికారులు సిబ్బంది, వివిధ పార్టీల నేతలు పాల్గొంటారు.

# బ్రహ్మోత్సవ కాంతులలో.. మెరిసే శేషశైల శిఖామణి

నానా దిక్కులెల్ల నరులెల్ల వానలలోనే వత్తురు కదిలి' అని అన్నమయ్య వర్ణించినట్టు- తిరుమల బ్రహ్మోత్సవాలకు దేశ విదేశాల నుంచి భక్తజన ప్రభంజనం పోటెత్తుతుంది. వరాహా, భవిష్యోత్తర పురాణాల్లో తిరుమల బ్రహ్మోత్సవాల ప్రశస్తి కనిపిస్తుంది. స్వామివారి బ్రహ్మోత్సవాలంటే .. తాళ్లపాకవారింట్లో మహాసందడి. అన్నమయ్య సాక్షాత్తూ ఆదిలక్ష్మి తండ్రి అవుతాడు. బ్రహ్మాండనాయకుడికి బాసికం కడతాడు. కమనీయమూర్తికి కన్యాదానం చేస్తాడు. గంగాజనకుడి కాళు కడుగుతాడు. ఆ తొమ్మిదిరోజుల వైభోగాన్నీ ఓ కీర్తనలో అద్భుతంగా వర్ణించాడు. శ్రీవారికి తొలిసారిగా బ్రహ్మదేవుడు ఈ ఉత్సవాన్ని జరిపించడం వల్ల ఇవి బ్రహ్మోత్సవాలుగా ప్రసిద్ధి కెక్కాయి. నవాహ్నిక దీక్షతో నవ బ్రహ్మలు తొమ్మిది రోజులు జరిపే ఈ ఉత్సవ పరంపర బ్రహ్మోత్సవాలయ్యాయని అంటారు. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడిగా భక్తులు ఆరాధించే దైవం తిరుమల శ్రీనివాసుడు. స్థల ప్రభావం, శిలా వైభవం కలగలసిన తిరుమల దివ్య క్షేత్రాన్ని భూలోక వైకుంఠంగా భావిస్తారు. శ్రీ వేంకటేశ్వరుని జగన్మోహనత్వం, జగదీశ్వర తత్వం యుగయుగాలుగా పరిఢవిల్లుతోంది. నిత్యకల్యాణం పచ్చ తోరణంగా విలసిల్లే తిరుమల శ్రీవారి సన్నిధి బ్రహ్మోత్సవ శోభతో అలరారనుంది. కోనేటిరాయుడు బ్రహ్మోత్సవ సంరంభంతో కొలువు దీరతాడు. కన్నుల వేడుకగా, అంగరంగ వైభవంగా సాగే ఈ మహోత్సవాలు అంకురార్పణతో ఆరంభమై చక్రస్నానంతో ముగుస్తాయి.


### బ్రహ్మ జరిపించాడు కాబట్టే...

'తిరువీధుల మెరసీ దేవదేవుడు, గరిమల మించిన సింగారముల తోడను ..తిరుదండెల పైనేగీ దేవుడిదే తొలినాడు... సిరుల రెండవనాడు శేషుని మీద, మురిపేన మూడోనాడు ముత్యాల పందిరిక్రింద, పౌరి నాలుగోనాడు పువ్వు కోవిలలోను, గక్కన నయిదవనాడు గరుడుని మీదను, ఎక్కెను ఆరవనాడు యేనుగు మీద, చొక్కమై ఏడవనాడు సూర్యప్రభలోనను, యిక్కువ తేరును గుర్ర మెనిమిదోనాడు, కనకపుటందలము కదిసి తొమ్మిదోనాడు, పెనచి పదోనాడు పెండ్లి పీట ఎనసి .. శ్రీవేంకటేశుడింతి అలమేల్మంగతో వనితల నడుమను వాహనాల మీదను!' అంటూ శ్రీవారికి తొలిసారిగా బ్రహ్మదేవుడు ఈ ఉత్సవాన్ని జరిపించడం వల్ల ఇవి బ్రహ్మోత్సవాలుగా ప్రసిద్ధి కెక్కాయి. నవాహ్నిక దీక్షతో నవ బ్రహ్మలు తొమ్మిది రోజులు జరిపే ఈ ఉత్సవ పరంపర బ్రహ్మోత్సవాలయ్యాయని అంటారు.

### కొలువు దీరే కోనేటి రాయుడు



అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడిగా భక్తులు ఆరాధించే దైవం తిరుమల శ్రీనివాసుడు. స్థల ప్రభావం, శిలా వైభవం కలగలసిన



తిరుమల దివ్య క్షేత్రాన్ని భూలోక వైకుంఠంగా భావిస్తారు. శ్రీ వేంకటేశ్వరుని జగన్మోహనత్వం, జగదీశ్వర తత్వం యుగయుగాలుగా పరిఢవిల్లుతోంది. నిత్యకల్యాణం పచ్చ తోరణంగా విలసిల్లే తిరుమల శ్రీవారి సన్నిధి బ్రహ్మోత్సవ శోభతో అలరారనుంది. కోనేటిరాయుడు బ్రహ్మోత్సవ సంరంభంతో కొలువు దీరతాడు. కన్నుల వేడుకగా, అంగరంగ వైభవంగా సాగే ఈ మహోత్సవాలు అంకురార్పణతో ఆరంభమై చక్రస్నానంతో ముగుస్తాయి. శ్రీవారి బ్రహ్మోత్సవ సంరంభంలో వాహన సేవలదే విశేష ప్రాముఖ్యం. తొమ్మిది రోజుల పాటు ఇరు దేవేరులతో శ్రీనివాసుడు వివిధ వాహనాలపై తిరుమాడ వీధుల్లో విహరిస్తాడు. దివ్యాలంకృతంగా, నవ్యమోహనంగా భక్తులకు శ్రీవారు భవ్యానందాన్ని అనుగ్రహిస్తాడు. బ్రహ్మోత్సవాల వేళ జరిగే ఊరేగింపులో దేవదేవునికి భక్తజనం బ్రహ్మరథం పడుతున్నారా అన్నంతగా కిటకిటలాడతారు. ఏ ఆలయంలోనూ లేని విధంగా ఇక్కడ అష్టదిక్పాలకులను, అంటే- అగ్ని, ఇంద్ర, యమ, నైరుతి, వరుణ, వాయు, కుబేర, ఈశానులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తారు.

### స్వామి ఊరేగింపు అద్భుతాహ

ముందుగా బ్రహ్మరథం, ఆ వెనుక వేదాలను, ద్రవిడ ప్రబంధాలను గళం నిండా నింపుకొన్న జీయరు స్వాములు, ఆ వెనుక అర్చకులు, ఆ వెనుక విష్వక్సేన- సుదర్శన- అనంత- గరుడులు, ఆ వెనుక జంత్రగాత్ర మంగళవాద్యకారులు, వేదాలను పఠిస్తూ వైదికులు, ఏనుగులూ, గుర్రాలూ, విలువైన వస్త్రాలను నడుంపై వేసుకున్న ఎద్దులూ, ఆ వెనుక దేవాలయంలో స్వామి ఊరేగింపులో పాల్గొనేందుకు నియమించిన ప్రత్యేక జనం, ఆవెనుక చక్కటి వస్త్రధారణతో పురందరదాసు కీర్తనలను ఆలపిస్తూ భక్తులు, ఆ వెనుక నృసింహ, శ్రీరామ, కృష్ణావతారాల్లో శ్రీహరి అవతార, మహత్యాలను, విశేషాలను వివరించే నర్తకీమణులు, ఆ వెనుక తాళాలు, భజనలు, సుద్దులు, జోలలు, తరువోజ పద్యాలు, దండకాలు చదువుతూ భక్తజనం, ఆ వెనుక పుష్పమయమైన ఆనాటి స్వామి రూపంలోని ఒక విగ్రహం, ఆ వెనుక అలంకరించుకున్న బోయీల భుజస్కందాల మీద మలయప్ప స్వామి (ఉత్సవమూర్తి అయిన వేంకటేశ్వరుడు) శ్రీదేవి, భూదేవిలతో వస్తాడు.

### వైభవానికి మారుపేరు బ్రహ్మోత్సవాలు

ఒక్కమాటలో చెప్పాలంటే వైభవం అనే మాటకు అర్థం కళ్లకు కట్టాలంటే తిరుమల బ్రహ్మోత్సవాలను తిలకించాల్సిందే! ఈ బ్రహ్మోత్సవాల్లో, ప్రతిరోజు ఉదయం మరియు సాయంత్రం భక్తులు వాహన సేవలను తిలకించవచ్చు. వాహన సేవలు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తాయి. పలు వాహన సేవలలో గరుడ వాహనం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది,ఈ బ్రహ్మోత్సవాలు తిరుమల శ్రీవారి భక్తులకు విశేష అనుభూతిని కలిగించే పరమ పవిత్రమైన సమయంలో నిర్వహించబడతాయి. నవరాత్రుల సమయంలో తిరుమల దేవస్థానం ఆధ్యాత్మికంగా పండుగ వాతావరణంలో తేలిపోతుంది.

మొదటి రోజున: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు సాయంత్రం ధ్వజారోహణం కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం స్వామి వారిని ఏడు తలలున్న పెద్దశేషవాహనంపై ఊరేగిస్తారు.

రెండో రోజున: ఉదయం ఐదు తలలున్న చిన్నశేషవాహనంపై స్వామి వారిని ఊరేగిస్తారు, అదే రోజు రాత్రి స్వామివారు హంస వాహనంపై విహరిస్తారు. మధ్యాహ్నం స్నపన తిరుమంజనం జరుగుతుంది.

మూడో రోజున: ఉదయం సింహవాహన సేవ మరియు రాత్రి ముత్యాపుపందిరి వాహనంపై ఊరేగింపు కనులవిందుగా సాగుతుంది.

నాలుగో రోజున: ఉదయం కల్పవృక్ష వాహనం మరియు రాత్రి సర్వభూపాల వాహనంపై స్వామి వారిని ఊరేగిస్తారు.

ఐదో రోజున: ఉదయం స్వామి వారిని మోహినీఅవతారంలో పల్లకిపై ఊరేగిస్తారు. రాత్రి స్వామి వారికీ ఇష్టమైన వాహనం అయిన గరుడవాహనం.

ఆరో రోజున: ఉదయం హనుమంతవాహనం, సాయంత్రం వసంతోత్సవం, సువర్ణరథరంగ డోలోత్సవం మరియు రాత్రి గజవాహనంపై స్వామి వారిని ఊరేగిస్తారు.

ఏడో రోజున: ఉదయం సూర్యప్రభ వాహనం అదే రోజు రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామి వారిని ఊరేగిస్తారు.

ఎనిమిదో రోజున: ఉదయం రథోత్సవం మరియు రాత్రి అశ్వవాహనంపై స్వామి వారిని ఊరేగిస్తారు.

తొమ్మిదో రోజున: ఆఖరి రోజు ఉదయం చక్రస్నాన వేడుకలతో బ్రహ్మోత్సవాల వేడుకలను ఘనంగా ముగిస్తారు. రాత్రి ధ్వజావరోహణం జరుగుతుంది.))

### బ్రహ్మదిలోకాలకిది చివరి కొండ

కట్టెదుటట్టెదుట కనిపించే వైకుంఠమే ఈ వేంకటాచలం. వేదాలే శిలలై వెలుగుతున్నాయి ఇక్కడ. బ్రహ్మదిలోకాలకు చివరిది ఈ కొండ. శ్రీదేవుడుండేది శేషాద్రి ఈ కొండ. సకలదేవతలు మృగజాతులై సంచరిస్తారిక్కడ! సముద్రాలే సానువులయింది - లక్ష్మి కాంతుని సుఖాలకు నిలయం - ఈ కొండ. సంపదలు పుష్కలముగా ఉండే ఈ కొండ. పై కలియుగ దైవమై కటి వరద హస్తాలతో భక్తులకు కొంగుపసిడిగా భాసిల్లే కోనేటి రాయుడు కొండలంత వరాన్ని ఇవ్వాలి.. నిత్యకల్యాణం పచ్చతోరణంలా భాసిల్లు అనంద నిలయ దేదీప్యకాంతులు లోకానికి శాంతిని ప్రసాదించాలి. సనాతన ధర్మాన్ని హైందవ సంస్కృతిని ఆచార వ్యవహారాలని స్వామి వారికి జరిపించే సేవలని ఉత్సవాలని సమర్పించే కైకర్యాలని పవిత్రమైన స్వచ్ఛమైన సాంప్రదాయ పద్దతిని వైఖానస ఆగమ శాస్త్ర బద్దంగా జరపవలసిందే. దీనిలో రాజీ పడటానికి ఏమాత్రం తావుని ఇవ్వరాదు. ప్రభుత్వం తిరుమల తిరుపతి పాలకమండలి వివిధ మఠాధిపతులు పండితుల సలహామేరకు వాటిని తూచా తప్పకుండా అమలు జరపి భక్తుల మనోభావాలను పరిరక్షించాలి. సర్వేజనాసుఖినోభవంతు.